
సాక్షి
బాపట్ల
గురువారం । 24 । ఆగస్టు । 2023




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1855 క్యూసెక్కులు వదిలారు.



నిమ్మకాయల ధరలు

తెనాలి : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం టిక్కీ నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,000, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 521.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఓటెత్తిన ఫిర్యాదులు

- బోగస్ ఓట్లపై ఫారమ్–7 దరఖాస్తులు
- కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు
- జిల్లాలో 30 వేలకు పైగా బోగస్ ఓట్లు
- అత్యధికంగా పర్చూరు నుంచి ఫారమ్–7
- మిగిలిన నియోజకవర్గాల నుంచీ పెద్ద ఎత్తున దరఖాస్తులు
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బోగస్ ఓట్లను ఆధారం చేసుకొని గతంలో జరిగిన పలు ఎన్నికల్లో నెగ్గిన ప్రతిపక్ష టీడీపీ రాబోయే ఎన్నికల్లోనూ దొంగ ఓట్లతో నెగ్గాలని కుట్రలకు తెరతీస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున బోగస్ ఓట్లను నమోదు చేయించి ఎన్నికల్లో పచ్చపార్టీ పబ్బం గడుపుకొంటోంది. ప్రధానంగా పర్చూరు, అద్దంకి, రేపల్లె నియోజకవర్గాల్లో అధికంగా ఉన్న బోగస్ ఓట్లతో టీడీపీ అభ్యర్థులు గతంలో విజయం సాధించినట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికల్లోనూ దొంగ ఓట్లతో ఇదే తరహాలో గెలుపొందేందుకు ఆ పార్టీ నేతలు సిద్ధమయ్యారు. స్థానికంగా లేకపోయినా ఎన్నికల సమయానికి పలువురు ఓటర్లు ఇక్కడికి వచ్చి ఓట్లు వేస్తుండటంతో పచ్చపార్టీ అభ్యర్థులు గెలుపొందుతున్నారు. ఈ నియోజకవర్గాలకు చెందిన వేలాదిమంది ఓటర్లు హైదరాబాదు, విజయవాడ, ఖమ్మం తదితర ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అటువంటి వారందరికీ పర్చూరు, అద్దంకి, రేపల్లెతో పాటు దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికీ ఓట్లు ఉన్నాయి. పైగా వారు స్థిరనివాసం ఉన్న హైదరాబాదు, విజయవాడ తదితర ప్రాంతాల్లోనూ ఓట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరగనుండడంతో ఈ తరహా ఓటర్లు నిబంధనలకు విరుద్ధంగా రెండు ప్రాంతాల్లోనూ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. పోలింగ్‌కు ముందురోజు నేతలు పదుల సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేసి దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఓటర్లను తరలిస్తున్నారు. 2019 ఎన్నికల్లో పర్చూరు నియోజకవర్గానికి చెందిన శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు సుమారు 50 బస్సులు ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల నుంచి 5 వేల మందికి పైగా ఓటర్లను తరలించినట్లు తెలుస్తోంది. అద్దంకి, రేపల్లె ప్రాంతాలకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లను పిలిపించుకొని గత ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారు. ఇదే తరహాలో రాబోయే ఎన్నికల నాటికి దొంగ ఓట్లు వేయించుకొని గెలిచేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

బోగస్ ఓట్లపై ఫిర్యాదులు

టీడీపీ నేతల దొంగ ఓట్ల వ్యవహారాన్ని పసిగట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేలు బోగస్ ఓట్ల వ్యవహారంపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేశారు.

పర్చూరు నియోజకవర్గంలో 10,792 బోగస్ ఓట్లు ఉన్నట్లు ఫిర్యాదు చేయగా, అద్దంకి నియోజకవర్గంలో 6,459, రేపల్లెలో 4536, బాపట్లలో 4570, వేమూరులో 1972, చీరాలలో 1712 చొప్పున బోగస్ ఓట్లు ఉన్నట్లు అధికార పార్టీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బోగస్ ఓట్లపై విచారణ చేపట్టాలని ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో కలెక్టర్ రంజిత్ బాషా బోగస్ ఓట్లపై విచారణ బాధ్యతను జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు అప్పగించారు. దీంతో జేసీ వెంటనే విచారణ చేపట్టారు. నిబంధనల మేరకు ఒక వ్యక్తి బోగస్ ఓట్ల తొలగింపు కోసం కేవలం 5 ఫారం–7 దరఖాస్తులు మాత్రమే పెట్టాల్సి ఉండగా ఒక్కో వ్యక్తి పేరున వందల కొద్దీ ఫారం–7 దరఖాస్తులున్నాయని అధికారుల విచారణలో తేలింది. ఇప్పటికే ప్రాథమిక విచారణ చేపట్టిన జిల్లా అధికారులు కొన్ని బోగస్ ఫిర్యాదులు కూడా ఉన్నట్లు గమనించినట్లు తెలిసింది. మొత్తం ఫారం–7 వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవంగా బోగస్ ఓట్లు ఉంటే వాటిని తొలగిస్తామని కలెక్టర్ చెబుతున్నారు. దీంతో పాటు ఫారం–7 పై తప్పుడు ఫిర్యాదులు చేస్తే అటువంటి వారిపై నిబంధనల మేరకు క్రిమినల్ చర్యలు తప్పవని సాక్షికి తెలిపారు.

బోగస్ ఓట్ల ఫిర్యాదులపై విచారణ



జిల్లా వ్యాప్తంగా బోగస్ ఓట్లంటూ ఫారం–7 ఫిర్యాదులు 30 వేలకు పైగా వచ్చాయి. అన్నిటిపైనా విచారణ చేస్తున్నాం. విచారణ బాధ్యతలు జాయింట్ కలెక్టర్‌కు అప్పగించాం. బోగస్ ఓట్లు ఉంటే తొలగిస్తాం. ఫారం–7కు సంబంధించి ఒక్కో వ్యక్తి ఐదు ఫిర్యాదులు మాత్రమే చేయాల్సి ఉంది. కొందరు బోగస్ ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. దీనిపైనా విచారణ జరిపి తప్పుడు ఫిర్యాదులు అని తేలితే చర్యలు తీసుకుంటాం.

– రంజిత్ బాషా, కలెక్టర్ ,బాపట్ల జిల్లా

ఆంధ్రకేసరి స్ఫూర్తితో ముందుకు..

కలెక్టర్ రంజిత్‌బాషా



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో ప్రతిఒక్కరూ అభివృద్ధి వైపు ఆత్మస్థైర్యంతో అడుగులు ముందుకు వేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంత్యుత్సవం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్రోద్యమంలో టంగుటూరి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఆయన భావితరాలకు ఆదర్శప్రాయుడన్నారు. డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, కలెక్టరేట్ ఏఓ గోపీకృష్ణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

షాదీతోఫా పేదలకు ప్రయోజనకరం



షాదీ తోఫా చెక్కును అందచేస్తున్న మంత్రి నాగార్జున

మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

భట్టిప్రోలు: ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం ప్రకటించిన షాదీతోఫా పేదలకు ప్రయోజనకరమైనదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయంలో బుధవారం షాదీతోఫా లబ్ధిదారులైన షేక్ షమీ మున్నీస్సా కుటుంబానికి రూ. లక్ష చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ పెళ్లి ఖర్చు భరించలేక ఇబ్బంది పడుతున్న పేదల కన్నీళ్లు తుడిచేందుకు ప్రభుత్వం పెళ్లి కానుక, షాదీ తోఫాలతో ఆపన్నహస్తం అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం అరకొరగా రూ. 50 వేలు ఇవ్వగా నేడు జగనన్న ప్రభుత్వం రూ. లక్ష అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, మంత్రి , జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. మేలు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర మొట్ట మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి కార్యాలయంలో నివాళులు అర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో ప్రకాశం పంతులు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వక్ఫ్ బోర్డ్ జిల్లా సభ్యులు సయ్యద్ నబీ, మత పెద్దలు అస్లాం, ఉప సర్పంచ్ బుర్లె రామ ప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సు బోల్తా



దాచేపల్లి: ప్రమాదవశాత్తూ ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇద్దరు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. కేశానుపల్లిలో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు 36 మంది విద్యార్థులతో పెదగార్లపాడు వెళ్తోంది. దాచేపల్లి మండలం తక్కెళ్లపాడు గ్రామ సమీపంలో రోడ్డు మార్జిన్ దాటే క్రమంలో బస్సు అదుపు తప్పి బస్సు బోల్తాపడింది. బస్సు డ్రైవర్, క్లీనర్‌లు అప్రమత్తమై విద్యార్థులను క్షేమంగా బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



అక్షర నీరాజనం : ఇస్రో అక్షరమాల రూపంలో మాచర్ల మండలం కంభంపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రదర్శన



విజయోత్సవం : నంబూరు వివా వీవీఐటీలో విద్యార్థుల ఆనందోత్సాహాలు

ఆ చంద్రతారార్కం అబ్బురపడేలా..

వెన్నెలొలికే చందమామ నవ్వులు చిలికిందా.. ముచ్చెన్నెలై తారాతోరణం తళుకులీనిందా.. ఆసేతుహిమాచలం ఆనంద నాట్యమాడిందా.. జగమే నిబిడాశ్చర్యంతో నివ్వెరబోయిందా.. అన్నట్టు నింగీనేలా సంతోషమై పరవశించాయి. ఊరూవాడా ఉప్పొంగాయి. చంద్రయాన్–3 విజయోత్సవంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. జయహో ఇస్రో నినాదం మిన్నంటింది.

–సాక్షి, నెట్‌వర్క్



జెండా జయహే: గుంటూరు మాంటిస్సోరి స్కూల్లో..



జయజయధ్వానం : గుంటూరులో విద్యార్థుల సంతోషం

చంద్రయాన్–3 విజయవంతం చారిత్రాత్మకం



గుంటూరు ఎడ్యుకేషన్: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం చారిత్రాత్మకమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా చెప్పారు. బుధవారం సాయంత్రం తన చాంబర్లో ఆమె చంద్రయాన్ –3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 విజయవంతం సువర్ణాక్షరాలతో లిఖించదగినదని పేర్కొన్నారు. ఇస్రో మరిన్ని ప్రయోగాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జె.మోహనరావు, ఏఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్ఐ అభ్యర్థులకు ఫిజికల్ పరీక్షలు

- గుంటూరు రేంజ్‌లో 12,957 మంది అర్హత
- 11,048 మంది పురుషులు, 1,909 మంది మహిళలు
- గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో చురుగ్గా ఏర్పాట్లు



మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, చిత్రంలో గుంటూరు ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఎస్ఐ ఉద్యోగాల కోసం గుంటూరు రేంజ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 15 వరకు గుంటూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఫిజికల్ (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు జరగనున్నట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో బుధవారం రేంజ్ కార్యాలయ పరిధిలోని అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఐజీ మాట్లాడుతూ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఎస్ఐ ఉద్యోగాల నియమాకానికి చేపట్టిన ప్రాథమిక పరీక్షల్లో గుంటూరు రేంజ్ పరిధిలో 12,957 మంది అభ్యర్థులు అర్హత సాధించారని వెల్లడించారు. వీరిలో 11,048 మంది పురుషులు, 1,909 మంది మహిళలు ఉన్నట్లు వివరించారు. ఫిజికల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్దేశిత ఒరిజినల్ సరిఫికెట్లతో హాజరవ్వాలని సూచించారు. ఈనెల 30, 31, సెప్టెంబర్ 1న ప్రత్యేకంగా మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ తేదీల్లో వీలుపడని వారు అప్పీలు చేసుకునేందుకు వీలు కల్పించినట్టు చెప్పారు. నిర్దేశిత తేదీల్లో గైర్హాజరైన వారు చివరి రోజైన సెప్టెంబర్ 15న అప్పీలు చేసుకునేందుకు, హాజరయ్యేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఐజీ వెల్లడించారు. సమావేశం అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఐజీ పరిశీలించారు. ఐజీ వెంట గుంటూరు ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, కె.కోటేశ్వరరావు (ఏఆర్) పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

- 30న ప్రారంభోత్సవానికి చర్యలు
- జేసీ శ్రీధర్, ఎమ్మెల్యే కరణం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

వేటపాలెం: ఈనెల 30న జగనన్న కాలనీలను లాంఛనంగా ప్రారంభిస్తారని జాయింట్ కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని బచ్చులవారిపాలెం వెళ్లే రోడ్డు దగ్గరలో కొత్తగా నిర్మాణంలో ఉన్న కొణిజేటినగర్–2 జగనన్న కాలనీని జేసీ, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, రుణాల పంపిణీ, వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలను ప్రారంభిస్తున్నారని చెప్పారు. కాలనీలో 303 మంది లబ్ధిదారులకు స్థలాలు పంపిణీ చేశామని, 283 మంది లబ్ధిదారులకు పక్కాగృహాలు మంజూరు చేశామని చెప్పారు. ప్రస్తుతం 243 గృహాల నిర్మాణం ప్రారంభించగా 203 ఇళ్లు తుదిదశకు చేరుకున్నాయని, మరో పది రోజుల్లో పూర్తికానున్నాయని వెల్లడించారు. ఈనెల 30న ఈ కాలనీతోపాటు అన్ని గృహాలూ ప్రారంభించడానికి లబ్ధిదారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కాలనీలో మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తవ్విస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులు తమ గృహాలను త్వరగా పూర్తి చేసుకోవడానికి అవసరమైన నగదును అదనపు రుణాలుగా మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కరణం బలరాం మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జగనన్న కాలనీలలో పేదలకు పక్కా గృహాలను మంజూరు చేసిందని తెలిపారు. సుందరంగా నిర్మించుకోవడానికి అవసరమైన నగదు, నిర్మాణ సామగ్రిని ప్రభుత్వం అందజేసిందన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలూ లేకుండా పేదలు సంతోషంగా జీవించడానికి అన్ని సదుపాయాలనూ కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ వై.శంకర్ నాయక్, తహసీల్దార్ అశోక్‌వర్ధన్, ఎంపీడీఓ నేతాజీ పాల్గొన్నారు.

ప్రతి భారతీయుడు గర్వపడేలా చంద్రయాన్–3

సత్తెనపల్లి: చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3ని విజయవంతంగా ల్యాండ్ చేసినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తల బృందానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయవంతంగా ప్రయోగించి చంద్రుడిపై ఉన్న ఆసక్తికర అంశాలను మానవాళికి అందించడంలో ఇస్రో శాస్త్రవేత్తలు ముందడుగు వేశారన్నారు. చంద్రుడిపై నివాసయోగ్యత, నీటి లభ్యత, జీవరాసుల మనుగడకు సంబంధిచిన సమాచారం ప్రపంచానికి చేరవేయడంలో భారతదేశం ముందుంటుందన్నారు. ఎన్నో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారిన భారత శాస్త్రవేత్తలకు, శాస్త్రవేత్తలను ప్రోత్సహించిన భారత ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. శాస్త్ర సాంకేతిక, భౌగోళిక, చంద్రమండల, అంతరిక్ష రంగాల్లో భారత్ గణనీయమైన అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. 140 కోట్ల భారతీయుల కలను సాకారం చేసిన భారత శాస్త్రవేత్తలకు మరొక్కసారి శుభాభినందనలు తెలిపారు.

దేశానికి గర్వకారణం

కొల్లూరు: చంద్రయాన్–3 విజయవంతం కావడం దేశ ప్రతిభకు నిదర్శనంగా నిలిచిందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బుధవారం చంద్రయాన్–3 చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా ల్యాండ్ అవడంపై ఆయన కొల్లూరులోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్పందించారు. ఆయన మాట్లాడుతూ, ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రయోగం విజయవంతం కావడంతో మన దేశ ప్రతిభా పాటవాలు ఏపాటివో ప్రపంచ దేశాలకు అవగతమైనట్లయిందని చెప్పారు. ఎన్నో దేశాలు సాధించలేని ఘనతను మన ఇస్రో శాస్త్రవేత్తల బృందం సాధించడం అభినందనీయమని చెప్పారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంలో నిమగ్నమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

అర్హులందరికీ ఓటు హక్కు

పర్చూరు (చినగంజాం): అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. ఇటీవల పర్చూరు నియోజకవర్గంలో ఇరుపక్షాల నేతలు ఓట్ల తొలగింపుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష నేతల ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈనేపథ్యంలో కలెక్టర్ విచారణ నిమిత్తం ప్రత్యేకాధికారిగా జేసీ శ్రీధర్‌ను నియమించడంతో బుధవారం ఆయన పర్చూరు తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. అధికార, ప్రతిపక్ష రాజకీయ నేతలతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అందిన మూడు ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులకు తెలిపినట్లు సమాచారం.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరునికి పూజలు



నరసరావుపేట రూరల్: చంద్రయాన్–3 ప్రయోగం జయప్రదం కావాలని కోరుతూ కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారతదేశ ఖ్యాతిని పెంచేలా ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగానికి త్రికోటేశ్వరుని ఆశీస్సులు అందించాలని అర్చకస్వాములు ప్రార్థించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకస్వాములు కిరణ్‌కిషోర్‌శర్మ, ఫణీంద్ర, కె.సత్యనారాయణ, శివాజీ, అనిల్ సాయిశర్మ పూజల్లో పాల్గొన్నారు.

తెనాలిలో 35.8 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తెనాలి మండలంలో 35.8 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 1.2 మి.మీ వర్షం పడింది. సగటున 7.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. దుగ్గిరాల మండలంలో 28.6 మి.మీ., కాకుమాను 24.6, కొల్లిపర 15.6, చేబ్రోలు 12.8, పెదకాకాని 5, ఫిరంగిపురం 3, గుంటూరు పశ్చిమ 2.4, తుళ్ళూరు 1.8, గుంటూరు తూర్పు 1.6, తాడేపల్లి మండలంలో 1.4 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు మాసం 23వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 122.8 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 89.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

యార్డుకు 33,805 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 33,805 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,299 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,800 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,971 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాదియాకు సత్కారం



తాడేపల్లిరూరల్: అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన వడ్డేశ్వరం కేఎల్‌యూ విద్యార్థిని షేక్ సాదియా భారత్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య ఆధ్వర్యంలో గన్నవరం విమానాశ్రయం వద్ద సాదియాకు ఘనస్వాగతం పలికి, అనంతరం యూనివర్సిటీలో ఆమెను ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేసినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూఏఈలోని షార్జా వేదికగా జరిగిన ప్రథమ ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ యూనివర్సిటీలో ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలతోపాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్‌ను కైవసం చేసుకోవడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు సాదియాను అభినందించారు.

చంద్రబాబు అబద్ధాల కోరు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



యద్దనపూడి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అబద్ధాల కోరు అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని జాగర్లమూడిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, మాజీ సీఎం చంద్రబాబు మధ్య ఏనుగు, దోమకు ఉన్నంత వ్యత్యాసం ఉందని.. చంద్రబాబు తన 40 ఏళ్ల ఇండస్ట్రీని, వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనతో పోల్చి చూస్తే అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇద్దరు నాయకులు పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకున్నవారే కానీ సీఎం అయ్యాక వైఎస్ జగన్, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో 98 శాతం పూర్తి చేశారన్నారు. కానీ ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబునాయుడు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. జనాభాలో అధిక శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలను గుర్తించి వారికి రాజకీయ, సాంఘిక, సామాజిక రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. నాడు– నేడు, అమ్మ ఒడి, విద్యా దీవెన తదితర పథకాలతో విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. చంద్రబాబుకు అధికారం అప్పగిస్తే అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తారని హెచ్చరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావటం ఖాయమని చెప్పారు. విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచి నక్కా పోతిరెడ్డి, నాయకులు యర్రం సుబ్బారెడ్డి, తనుబొద్ది సుబ్బారెడ్డి, అమృతలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

అద్దంకి: అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తీసుకుంటామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. ఆమె గురువారం పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ ఎలా ఉంది.. పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బత్తుల వారిపాలెం సెంటర్‌లో గుడ్లను అందించడం లేదని, మరుగుదొడ్డి సౌకర్యం లేదని గుర్తించారు. సెంటర్‌ను మార్చాలని ఉమెన్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై పూర్తి స్థాయి నిఘా ఉందని, ఎక్కడ అవకతవకలు జరిగినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం చిన్నారుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. వీటిని సద్వినియోగం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఓఆర్‌డబ్ల్యూ, డీసీపీయూ శామ్యూల్ రాజ్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కమిటీ సభ్యురాలు పద్మావతి

పథకం ప్రకారమే టీడీపీ దొంగ ఓట్లు చేర్పించింది

వైఎస్సార్ సీపీ పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు(చినగంజాం): టీడీపీ నాయకులు ఓ పథకం ప్రకారమే దొంగ ఓట్లను గత ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో చేర్పించిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ 2014, 2019 ఎన్నికల సమయంలో నెట్ సెంటర్‌లు, మీ సేవా కేంద్రాలు, తమ సొంత పార్టీ కార్యాలయాలను కేంద్రంగా చేసుకొని భారీ ఎత్తున నకిలీ ఓట్లు చేర్పించారని, వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయని చెప్పారు. నకిలీ ఓట్లు జాబితాను సమాచార హక్కు చట్టం ద్వారా బయటికి తీసినట్లు వివరించారు. నకిలీ ఓట్లపై గతంలోనే కేసు నమోదు చేసినా దానిని పక్కన పడేశారని, అదే కేసును మళ్లీ విచారణ స్వీకరించాలని కోరినట్లు చెప్పారు. విచారణలో అవి నకిలీవని తేలితే కొందరు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. న్యాయం తమ వైపు ఉందని, అధికార పార్టీలో ఉన్నామని చట్టపరిధిలో నడుచుకుంటున్నామని, తప్పు జరిగిందనే విషయం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సంయమనం పాటిస్తున్నామని పేర్కొన్నారు. మా మంచి తనాన్ని అలుసుగా తీసుకొని బీఎల్‌ఓలను, అధికారులను బెదిరిస్తే చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విదేశాల్లో నివాసం ఉన్న వారి ఓట్లు, వివాహాలై వెళ్లిన వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తప్పనిసరిగా తొలగించాలన్నారు. తాము దొంగ ఓట్లు తొలగించాలని మాత్రమే పట్టుబడుతున్నామని యథార్థమైన ఓట్లు జోలికి వెళ్లడం లేదని ఆమంచి చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉంటే తొలగించకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. కారంచేడులో 12 వేలు జనాభా ఉంటే 10 వేల పైచిలుకు ఓట్లు ఎలా ఉంటాయని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం కాదా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కోట హరిప్రసాద్, నీరుకట్టు వాసుబాబు, శివరాం, ఉప్పలపాటి చెంగలయ్య, పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తాన్ వలి, గోరంట్ల శివకుమారి, తులసి నాగమణి, తోకల కృష్ణమోహన్, గాదె సురేష్, జంగా అనిల్, హేమంత్, కుక్కపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియ పూర్తి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా కోసం ఓటరు సర్వే ప్రక్రియ పారదర్శకంగా ముగించినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మృతులు, శాశ్వత వలసలు వెళ్లిన వారిని పక్కాగా గుర్తించినట్లు చెప్పారు. 30,041 ఓట్లు తొలగించడానికి ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వాటిని నిశితంగా పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తొలగించడానికి పరిశీలిస్తామని వివరించారు. నూతనంగా ఓటు హక్కు కావాలని 29,419 మంది పౌరులు సర్వే సమయంలో దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల చిరునామాల చేర్పులు, మార్పుల కోసం ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 27,956 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. వీటన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందని రాజకీయ పార్టీలకు ఆయన వివరించారు. జిల్లా వ్యాప్తంగా బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల, 23 వేల 801కుటుంబాలలో ఓటర్ల సర్వేను పారదర్శకతతో పక్కాగా నిర్వహించినట్లు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల పనిచేయాలన్నారు. తమ ఏజెంట్ల ద్వారా క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలకు అన్ని విధాలుగా సహకరించాలని పలు సూచనలు చేశారు. వేమూరు నియోజకవర్గంలో తొలగింపు కోసం 1,972 దరఖాస్తులు వచ్చాయన్నారు. రేపల్లెలో 4,536 దరఖాస్తులు, బాపట్లలో 4,570 దరఖాస్తులు, పర్చూరులో 10,792 దరఖాస్తులు, అద్దంకిలో 6,459 దరఖాస్తులు, చీరాలలో 1,712 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, బీజేపీ నాయకులు జీవీఎల్ మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

నలిగిన చేతివేళ్లను సరిచేశారు

జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీలో కాస్మోటాలజీ వైద్యసేవలు



ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ నిశాంత్ సాధనాల

గుంటూరు మెడికల్: పనిచేస్తున్న ప్రదేశంలో పెద్దరాయి చేతిపై పడి చేతివేళ్లు నుజ్జు నుజ్జు అయిన వ్యక్తికి గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ చేసి చేతివేళ్లను సరిచేశారు. నీలాంబరం అనే 55 ఏళ్ల వ్యక్తి కూలిపనికి వెళ్లి పనిచేస్తున్న ప్రదేశంలో కుడిచేతిపై పెద్దరాయి పడటంతో కుడిచేతికున్న మూడు వేళ్ల ఎముకలు విరిగిపోయి నుజ్జునుజ్జు అయ్యాయి. గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగానికి మూడు రోజుల క్రితం బాధితుడు వచ్చాడని సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సాధనాల నిశాంత్ చెప్పారు. చేయి బాగా వాచిపోయి ఉండటంతో రెండురోజులపాటు అడ్మిషన్‌లో ఉంచి చికిత్స అందించామన్నారు. బుధవారం హ్యాండ్ సర్జరీ డేను పురస్కరించుకుని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారు రూ.లక్ష ఖరీదు చేసే ఆపరేషన్‌ను నీలాంబరంకు పూర్తి ఉచితంగా చేశామన్నారు.

పూర్తి ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీ సేవలు..

ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో కాస్మోటాలజీ వైద్యసేవలను సైతం పూర్తి ఉచితంగా అందిస్తున్నాని తెలిపారు. కొట్లాటల్లో, ప్రమాదకరమైన మెషిన్ల వద్ద పనిచేస్తున్న సమయంలో, అగ్ని ప్రమాదాల్లో, రోడ్డు ప్రమాదాల్లో చేతులు , చేతివేళ్లు తెగిపోయినా గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. విరిగిపోయిన, నలిగిపోయిన చేతి వేళ్లను, వంకరపోయిన వాటిని, తెగిపోయిన వాటిని సైతం సరిచేస్తున్నామన్నారు. పుట్టుకతో అతుక్కుపోయిన చేతివేళ్లను సైతం ఆపరేషన్ చేసి సాధారణ స్థితికి తెస్తున్నామన్నారు. వేలు తెగినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. తెగిన వేళ్ల వల్ల చేతి పనితీరులో పలు సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. తెగిపోయిన వేలి భాగాన్ని బాధితులు వెతికి తీసుకురావటం, లేదా ఇతరులకు చెప్పి వెతికించి ఆస్పత్రికి అంబులెన్స్‌లో త్వరగా తరలించటం ద్వారా ఉపయోగం ఉంటుందని తెలిపారు. తెగిన వేలి గాయం వద్ద సెలైన్ వాటర్‌తో శుభ్రం చేసుకుని శుభ్రమైన గాజుగుడ్డ, డ్రెస్సింగ్‌తో తేలికగా గాయాన్ని కప్పిఉంచాలన్నారు. రక్తస్రావం ఆపటానికి కొంచెంచ ఒత్తి ఉంచాలని, రక్తస్రావం, వాపును తగ్గించేందుకు గాయపడిన చేతిన గుండెపైకి ఎత్తి ఉంచాలని సూచించారు. తెగిన వేలిని నేరుగా ఐస్ ముక్కలపై పెట్టకుండా తడి లేకుండా చల్లగా ఉంటే సంచిలో చుట్టుకుని వైద్యుల వద్దకు తీసుకురావాలని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ వైద్య విభాగానికి అత్యాధుని వైద్య పరికారాలు అందించటం వల్ల కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా మెరుగైన వైద్యసేవలను పూర్తి ఉచితంగా పేదలకు అందిస్తున్నామన్నారు.

అభయమిచ్చారు.. అన్నలా ఆదుకున్నారు

- ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన భర్త
- సీఎం వైఎస్ జగన్‌ను కలిసి సమస్యను వివరించిన మహిళ
- సీఎం సహాయ నిధి నుంచి రూ.7.50లక్షలు విడుదల
- ఆనందం వ్యక్తం చేస్తున్న దంపతులు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లిరూరల్: కుటుంబానికి ఆధారమైన వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై వైద్యానికి డబ్బులు లేక అప్పులు చేసి మంచానికే పరిమితమవడంతో తమను ఆదుకోవాలంటూ ఓ మహిళ బాధను విన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థికసాయం అందించాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారు. బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అందజేయడంతో సదరు మహిళ, కుటుంబ సభ్యులు ఆనందంతో కంటతడి పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దుగ్గిరాల గ్రామానికి చెందిన ఒడుగు నాగూర్ ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ఓ రైస్‌మిల్‌లో పనిచేస్తూ దుగ్గిరాలలో వున్న తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెలలో రైస్‌మిల్లు నుంచి భోజనానికి రోడ్డుమీదకు వచ్చిన నాగూర్‌ను ఓ ట్రాక్టర్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు నాగూర్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగూర్ మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పేదలందరికి ఇళ్ల శంకుస్థాపనకు వస్తున్నారని తెలుసుకున్న నాగూర్ భార్య యశోద సీఎం సభలో ఆయన స్టేజీమీద ప్రజలకు అభివాదం చేస్తుండగా ఎక్కడో జనాల మధ్య వున్న యశోద జగనన్నా నీతో మాట్లాడాలి అన్నా.. అంటూ చేతుల ఊపుతూ సైగలు చేయడంతో తన వ్యక్తిగత సిబ్బందిని పంపించి ఆమెను వేదికపైకి పిలిపించారు. వెంటనే తన భర్త ఆరోగ్య పరిస్థితి వివరించడంతో ఆదుకుంటామని తన దగ్గర ఉన్న అర్జీలను తీసుకుని కలెక్టర్‌కు అందజేశారు. ఈక్రమంలో నెల రోజుల వ్యవధిలోనే తమ కుటుంబానికి సీఎం సహాయ నిధి కింద రూ.7.50లక్షలను జగనన్న పంపించారని యశోద కన్నీళ్లపర్యంతమయింది. అయినవాళ్లే దూరంపెట్టిన తమకు సొంత అన్నలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభయమిచ్చి, ఆదుకున్నారని తెలిపారు. ఎంపిపి దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, సర్పంచ్ బాణావత్ కుషీబాయి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇంటర్ విద్యార్థిని మృతి

మార్టూరు: తండ్రి మందలించడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్‌ఐ కే కమలాకర్ తెలిపిన వివరాలు.. జొన్నతాళికి చెందిన పోతినేని అనిల్‌కుమార్, శ్రావణి దంపతుల కుమార్తె ధనలక్ష్మి(16) చిలకలూరిపేట చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన ధనలక్ష్మిని సెల్‌ఫోన్ ఎక్కువగా వాడుతున్నావని ఆగస్టు 4వ తేదీ సాయంత్రం తండ్రి మందలించాడు. మనస్తాపానికి గురైన ధనలక్ష్మి అదే రోజు రాత్రి ఇంటిలో ఉన్న గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ఆస్పతిలో ధనలక్ష్మిని గత 19 రోజులుగా చికిత్స చేయించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి బుధవారం వేకువ జామున గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందింది. ఏఎస్‌ఐ కే వెంకటేశ్వర్లు కేసును నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం ధనలక్ష్మి మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నార్త్‌జోన్ జట్టుపై సౌత్‌జోన్ విజయం

ఉత్కంఠభరితంగా ఏసీఏ సీనియర్ ఉమెన్ ఇంటర్‌జోనల్ వన్డే మ్యాచ్‌లు



5 వికెట్లు పడగొట్టిన సౌత్‌జోన్ బౌలర్ జి.చంద్రలేఖ



60 పరుగులు సాధించిన నార్త్‌జోన్ బ్యాటర్ ఎ.శిరీష

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నవులూరు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన ఏసీఏ సీనియర్ ఉమెన్ ఇంటర్‌జోనల్స్ వన్డే మ్యాచ్‌లో నార్త్‌జోన్ జట్టుపై సౌత్ జోన్ జట్టు 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుని సౌత్‌జోన్ జట్టుకు బ్యాటింగ్ అప్పగించగా 48.3 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాటరు ఎ.శిరీష 113 బంతుల్లో 3 ఫోర్లతో 60 పరుగులు సాధించగా మరో బ్యాటరు కె.హంస 79 బంతుల్లో 3 ఫోర్లతో 42 పరుగులు సాధించింది. నార్త్ జోన్ బౌలర్ కె.జ్యోతి 10 ఓవర్లలో 39 పరుగులిచ్చి 3 వికెట్లను పడగొట్టింది. అనంతరం 191 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన నార్త్‌జోన్ జట్టు 45.1 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలింది. జట్టు బ్యాటరు ఎం.దుర్గ 73 బంతుల్లో 27 పరుగులు సాధించింది. సౌత్‌జోన్ బౌలర్ జి.చంద్రలేఖ 8.1 ఓవర్లలో 18 పరుగులిచ్చి 5 వికెట్లను పడగొట్టింది.

ప్రకాశం పంతులు చిరస్మరణీయుడు

జిల్లా అడిషనల్ ఎస్పీ మహేష్



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎస్పీ మహేష్

బాపట్లటౌన్: ప్రకాశం పంతులు జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ పి.మహేష్ మాట్లాడుతూ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ప్రస్తుత ప్రకాశం జిల్లా, వినోదరాయునిపాలెం గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదువుకొని ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ప్రకాశం పంతులు గొప్ప దేశభక్తి కలిగిన వ్యక్తి, దేశ స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తితో యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ మురళీకృష్ణ, బాపట్ల పట్టణ సీఐ పి.కృష్ణయ్య, అడ్మిన్ ఆర్ఐ మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

సరైన పద్ధతిలో సాగుచేస్తే లాభాలు

జే పంగులూరు: సరైన పద్ధతిలో సాగుచేస్తే నష్టాలు దరిచేరవని డీడీఏ విజయనిర్మల అన్నారు. మండల పరిధిలోని టీ కొప్పెరపాడు గ్రామంలో బుధవారం రైతులకు ఆత్మ పథకం కింద జిల్లా వనరుల కేంద్రం బాపట్ల ఆధ్వర్యంలో ఖరీఫ్‌లో సాగు చేసే, పంటలైన మినుము, మొక్కజొన్న, మిరప పంటలపై సాగు పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసే వివిధ పంటలపై సాగు పద్ధతులను వివరించారు. డాట్ సెంటర్ (ఏరువాక కేంద్రం) కో ఆర్డినేటర్ డాక్టర్ ఓబయ్య మొక్కజొన్న సాగు పద్ధతులు, కత్తెరపురుగు నివారణ చర్యల గురించి మాట్లాడారు. శాస్త్రవేత్త వీ సురేఖదేవి, మినుము పంటలపై సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి జెన్నమ్మ మిరప సాగు పద్ధతుల్లో పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏట సుబ్బారెడ్డి, సర్పంచి వై.కల్యాణి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సింధూర అజిల్, సొసైటీ అధ్యక్షుడు జి.నాగేశ్వరావు, వీఏఏ పి.సునీత, శ్రీవాణి, శ్రీలక్ష్మి, ప్రియ, ఫిలిప్ పాల్గొన్నారు.

27న ఫుట్‌బాల్ జిల్లా అండర్-17 జట్ల ఎంపిక

చీరాల రూరల్: ఫుట్‌బాల్ అండర్- 17 బాల, బాలికల జట్లను ఈనెల 27వ తేదీ ఎంపిక చేయనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌ఆర్ అండ్ పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 1-1-2007 నుంచి 31-12-2009 మధ్య జన్మించినవారై ఉండాలని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు నిర్ధారణ కోసం బర్త్ సర్టిఫికెట్ లేదా ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జి బొనిగల ప్రేమయ్య 98668 02309, బాపట్ల ఫుట్‌బాల్ అసోసియేషన్ కో ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు 94908 35238 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వృద్ధుడి గొంతు కోసిన యువకుడు



పూర్ణచంద్రరావు(ఫైల్)

అద్దంకి రూరల్: పాత గొడవలతో వృద్ధుడిని ఓ యువకుడు గొంతు కోసిన ఘటన అద్దంకిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రమేష్ తెలిపిన వివరాలు.. అద్దంకి గాంధీబొమ్మ సెంటర్లో నివాసం ఉంటున్న వృద్ధుడు శిఖాకొల్లి పూర్ణచంద్రరావుకు యువకుడు నీలకంఠతో పాత గొడవలున్నాయి. ఇద్దరు గొడవ పడ్డారు. నీలకంఠ ఉల్లిపాయలు కోసే కత్తితో పూర్ణచంద్రరావుపై దాడిచేసి మెడ కోశాడు. పారిపోతున్న నీలకంఠను స్థానికులు, క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసి నీలకంఠను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. క్షతగాత్రుడిని ప్రైవేటు అంబులెన్స్‌లో ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.